

# చాయమ్మ

- సలీం

ఆమె పేరేంటో నాకే కాదు మా ఆఫీసులో పనిచేసే ఎవ్వరికీ తెలీదు. మా ఆఫీస్‌కి వెనక పక్క ఉన్న క్యాంటీన్లో గ్లాసులు కడగటం, చాయ్‌లు అందించటం చేస్తో ఉంటుంది కాబట్టి అందరూ ఆమెని చాయమ్మా అనే పిలుస్తారు.

ఆమెని చూసినపుడల్లా నాకు జాలనిపిస్తుంది. ఆమె కొడుకుల మీదా కూతుర్ల మీదా విపరీతమైన కోపం వస్తుంది. అసలు మానవ సంబంధాలు బతికున్నాయా అనే అనుమానం వస్తుంది.

ఓ స్టీల్ కంచంలో చాయ్ గ్లాసులు పెట్టుకుని ఆఫీసు లోపలికి వచ్చిందామె. అలవాటు చొప్పున ఒక్కొక్కరికి చాయ్ గ్లాసులందిస్తూ నా ముందు కూడా ఓ గ్లాసు పెట్టింది.

"చాయమ్మా... ఈ వయసులో హాయిగా అల్లాని తల్చుకుంటూ విశ్రాంతి తీసుకోక ఎందుకీ కష్టం చెప్పు?" అన్నాను.

"యిందులో కష్టమేముంది బేటా... నా వొంట్లో యింకా సత్తు వుంది. పని చేయగలిగినన్ని రోజులు చేస్తాను. ఏ పనీ చేయకుండా బేకారీగా కూచొని తినటం నాకు నచ్చదు బేటా. అయినా నాకెంత వయసైపోయిం దనీ... అరవై రెండో అరవై మూడో... అంతే" అంది నవ్వుతూ. ఆమె నవ్వులో పసిపిల్ల జోసి నవ్వులోని భోళా తనం...

"నీవుండేదెక్కడ?"

"సిక్కు విలేజ్ దాటెళ్ళాలి బేటా. ఇక్కడికి రావడానికి రెండు బస్సులు మారాలి. మరో మైలు నడవాలి."

ఆమె వైపు మెచ్చుకోలుగా చూశాను. షాపూర్‌హౌజ్ అనబడే ఈ బిల్డింగ్‌లో రెండువందల వరకూ ఉద్యోగ స్థులుంటారు. ఎక్కువ మందికి మోటారు వాహనాలు న్నాయి. అయినా పదకొండు దాటితే గాని ఆఫీసుకి రారు. కానీ చాయమ్మ తొమ్మిదికి ముందే వచ్చేస్తుంది. క్యాంటీన్ అంతా వూడ్చి శుభ్రం చేస్తుంది. గిన్నెలు, గ్లాసులు కడిగి పెడుతుంది. పదయ్యేటప్పటికి వేడి వేడి చాయ్ గ్లాసుల్లో సర్దుకుని ఆఫీసులోకి ప్రవేశిస్తుంది.

"అవును గానీ చాయమ్మా, నువ్వింత కష్టపడ్తావు కదా. మీ యజమాని ఎంత జీతం ఇస్తాడేమిటి?" అని అడిగా.

"వెయ్యి రూపాయలిస్తాడు. బస్సు కిరాయికోసం మరో మూడొందలిస్తాడు."

"అంతేనా... వెయ్యి రూపాయలకోసం ఇంత కష్టప డాలా? నీ కొడుకులు దుర్మార్గుల్లా ఉన్నారే... ఓసారి పిల్చుకు రా. మాట్లాడతాను."

చాయమ్మ దెబ్బతిన్నట్లు చూసింది.

"నాకు ఒక్కడే కొడుకు. ఆరుగురు ఆడ పిల్లలు. అందరికీ పెళ్ళిళ్ళు చేశాను. నా కొడుకు ఫరూక్ బంగారం. వాడు పనికి వెళ్ళొద్దమ్మా అనే అంటాడు. నాకే తోచదు. కాయకష్టం చేసిన శరీరం. నాకు పనిలోనే తృప్తి" అందామె నా పక్క సీటువైపు కదులుతూ.

మాతృ ప్రేమ ఎంత గొప్పదో... తన కొడుకు తిండి పెట్టకుండా పనిచేసి పొట్టపోసుకునే అగత్యం కలుగచే సినా ఎలా వెనకేసుకొస్తుందో...

చాయ్ తాగిన గ్లాసులు తీసుకుని క్యాంటీన్ వైపు వెళ్తోన్న చాయమ్మ వైపు చూశాను. నిఖార్సయిన మాతృ మూర్తిలా... అయిదడుగులకు మించని ఎత్తు... పిట్ట లాంటి పల్చటి శరీరం... తెల్లగా పండిపోయిన జుట్టు... బలహీనంగా ఉండక ఇంకెలా ఉంటుంది? రెండు బస్సులు మారి రావాలంటే ఉదయం ఏ అయిదింటికో లేవాలి. ఇక్కడ సాయంత్రం ఆరు వరకు పని. కూచోడా నికి తీరికుండదు. చాయ్ గ్లాసులు పట్టుకుని తిరుగు తూనే ఉండాలి. మూడంతస్థులు ఎక్కి దిగాలి. వెయ్యి రూపాయలకోసం... ఆ డబ్బు ఒక్క పొట్ట కైనా ఏ మూలకు సరిపోతుంది?

నాకు అమ్మ గుర్తొచ్చింది. నా రెండోయేట నాన్న చనిపోతే నన్నూ అన్నయ్యని సాకటం కోసం రెక్కలు ముక్కలుచేసుకున్న అమ్మ... నాకంటే అన్నయ్య పదేళ్ళు పెద్దాడు. మా యిద్దరికీ మధ్యలో యిద్దరు పుట్టి ఆర్నెల్ల లోపే చనిపోయారట. అన్న చదువుకోసం అమ్మ పొలం పనులకెళ్ళేది. ఒంటి మీదున్న వీసమెత్తు బంగారం అమ్మేసింది. చివరికి అప్పులు కూడా చేసింది. ఏమైతేనేం ఆమె పడిన శ్రమకు ప్రతిఫలంగా అన్నకు సెక్రెటేరి యట్‌లో ఉద్యోగం వచ్చింది.

మా కష్టాలన్నీ తీరిపోయాయను కున్నాం. "అప్పులన్నీ మెల్లమెల్లగా తీర్చేసి హైద్రాబాద్ వెళ్దాం. యిక నీ చదువు గురించి దిగుల్లేదు. పెద్దాడే చూసుకుంటాడు"అంటూ అమ్మ మురిసిపోయింది. కానీ అసలు కష్టాలన్నీ అప్పట్నుంచే మొదలయ్యాయి. అన్నయ్య పైసా పంపించేవాడు కాదు. ఉత్తరాలు రాయడం మానుకున్నాడు. అదేమని ఆఫీసుకి ఫోన్ చేసి అడిగితే 'హైద్రాబాద్‌లాంటి చోట ఎంతెంత ఖర్చో తెలుసా మీకు? మన పల్లెటూరనుకుంటున్నారా? నా జీతం నాకే సరిపోవటం లేదు. చాలా యిబ్బందిగా ఉంది. అమ్మనే అడుగుదామనుకుంటున్నా, నెలకొంత పంపించమని" అనేవాడు.

నిజమే కామోసని అమ్మ దిగులు పడేది. అదంతా వట్టి నాటకమని ఎంత చెప్పినా నమ్మేది కాదు. అన్న య్యంటే అమ్మకు ప్రాణం.

నా చదువుకోసం యింట్లో ఉన్న వస్తువులు తాకట్టు పెట్టాల్సి వచ్చినపుడు, "అదేంటి నాగరత్నం వదినా... మీ పెద్దబ్బాయికి గవర్నమెంటు ఉద్యోగమట కదా"అని ఎవరైనా అడిగితే "వాడైనా ఎంతని సర్దగలడు పిచ్చి సన్నాసి? నెలనెలా వద్దన్నా డబ్బులు పంపిస్తూనే ఉన్నాడు. అప్పులు తీర్చాలి కదా. అందువల్ల యిబ్బంది" అంటూ అన్నయ్యని వెనకేసుకొచ్చేది.

అనారోగ్యంతో అమ్మ మంచం పట్టినపుడు నేను డిగ్రీ మూడో సంవత్సరంలో ఉన్నాను. అన్నకు ఎన్ని ఉత్త రాలు రాసినా జవాబు లేదు. ఫోన్ చేసినా లాభం లేదని నేనే హైద్రాబాద్ బయల్దేరాను. ఎర్రటి ఎండ... కాలి నడ కనే వెతుక్కుంటూ ఆఫీస్‌కెళ్ళి కలుసుకుంటే కనీసం యింటికి రమ్మని పిలవలేదు. "బాగా పని వత్తిడి ఉంది.

వీలు చూసుకుని వస్తానని చెప్పు. ఏం చేస్తాం? ఉద్యోగాలమీద ఆధారపడి బతికేవాళ్ళం కదా. బానిస బతుకులు" అన్నాడు.

మా వూరికొస్తే అమ్మచేసిన అప్పులన్నీ అతని మెడకు చుట్టుకుంటాయని అన్నయ్య భయం. కానీ ఆ అప్పు లన్నీ అతనికోసం చేసినవేనన్న యింగితం లేని వ్యక్తి.

"పెద్దాడు రాడంటావా" అనేది నిరాశగా అమ్మ.

"అన్నయ్య తప్పకుండా వస్తాడమ్మా... నువ్వంటే వాడికి ప్రాణం" అంటూ ఆశ పెట్టేవాణ్ణి. ఆ విధంగానైనా మరికొన్నాళ్ళు ప్రాణాల్ని నిలుపుకుంటుందన్న ఆశ...

అమ్మ చనిపోయాక అనుబంధాల మీద నమ్మకం పోయింది. ఈ సమాజం ఓ కీకారణ్యం. యిక్కడ పులులూ, సింహాల్లాంటి క్రూర మృగాలు తిరుగుతుంటాయి. యిక్కడ ప్రేమకూ మమకారాలకూ చోటులేదు. అంతా డబ్బు. డబ్బంటే ప్రేమ... డబ్బంటే వ్యామోహం... మనుషులక్కరలేదు... మమతలసలే లేవు. ఎవరు అన్నా ఎవరు తమ్ముడు? కని, పెంచిన వాళ్ళకే దిక్కులేదు. యిక్కడ ఎవరికీ ఎవరూ ఏమీ కాదు. ఎవరికి ఎవరు ఏమౌతారనేది డబ్బు నిర్ణయిస్తుంది.

ఆదాయపు పన్ను శాఖలో ఉద్యోగం వచ్చి హైద్రాబాద్ చేరుకున్నాక నా నమ్మకం యింకా బలపడింది. యిది కాంక్రీట్ అడవి. యిక్కడి మనుషుల హృదయాల నిండా కాంక్రీటే...

మా అన్నయ్యలాంటి రాక్షసులే నగరం నిండా. చాయమ్మ కొడుక్కూడా అంతే. అందుకే పాపం ఈ వయసులో కూడా చెమటోడ్చి పనిచేయాల్సిన ఖర్మ పట్టిందామెకు.

ఆ రాత్రంతా నాకు చాయమ్మ గుర్తొచ్చి నిద్ర పట్ట లేదు. ఈనాటి తల్లులందరూ గత జన్మలోని శత్రువుల్నే పిల్లలుగా కంటున్నారేమో. కడుపుతీపితో వాళ్ళు ప్రేమిం చినా కొడుకులు మాత్రం కత్తులు నూరుతున్నారు. చాయమ్మకు ఎలాగైనా సహాయపడాలనుకున్నాను. నాకు ఉద్యోగం రాకముందే అమ్మ చనిపోయింది. ఆమె నెలాగూ సుఖపెట్టలేకపోయాను. చాయమ్మనైనా ఈ వృద్ధాప్యంలో ఆదుకోవాలి.

జీతాలొచ్చిన రోజు సాయంత్రం చాయమ్మకోసం ఎదురు చూశాను. ఆరోజు చాయ్ డబ్బులు అడగడాని కొచ్చినప్పుడు ఆమె చేతిలో రెండు వంద రూపాయల నోట్లు పెట్టాను.

"క్యా హై బేటా... నాకివ్వాల్సింది మూడు చాయ్‌ల పైసలు... పన్నెండు రూపాయలే" అందామె రెండోం దల్ని నాకు తిరిగిచ్చేస్తూ.

"నాకు తెల్సులే... మిగతా డబ్బులు నీకోసం. యిలా ప్రతినెలా ఇస్తాను. ఇంతకంటే ఎక్కువ యివ్వలేను ఏమ నుకోకు. యింటి దగ్గర తీర్చాల్సిన అప్పులున్నాయి" అన్నాను.

ఆమె మొహం నవ్వుతో పండిపోయింది. "సౌ సాల్ జియో బేటా... వందేళ్ళు బతుకు బాబూ" అంటూ దీవించింది.

ఒక వంద నోటు తిరిగిచ్చేసి, ఎనభైఎనిమిది రూపా యల చిల్లర చేతిలో పెట్టింది.

"ఉంచుకో... పర్లేదు" అన్నాడు తిరిగివ్వబోతూ.

"నకో బేటా. వద్దు నాయనా. యింకొకరి దగ్గర దానం తీసుకోవాల్సిన అగత్యం నాకు రాలేదు. రాదు కూడా. శ్రమను నమ్ముకున్న దాన్ని. అల్లా ఎప్పుడూ అన్యాయం చేయడు."

"సర్లే... మీ యిల్లెక్కడో చెప్పు. ఎప్పుడో ఓసారొచ్చి నీ కొడుకుతో మాట్లాడ్తాను."

"తప్పకుండా రా బేటా... నా కొడుకు ఫరూక్ నీలానే హీరా జైసా బేటా... మా యింట్లో భోంచేసి వెళ్దువుగానీ" అంది.

మరలా నాకు మా అమ్మ గుర్తొచ్చింది. కొడుకు దుర్మార్గుడైనా ఎలా పొగుడుతుందో చూడు... అందరి అమ్మలూ ఒక్కటే... పిచ్చి తల్లులు... శిలువల్ని కడుపులో మోసే ఆడ క్రీస్తులు...

ఆదివారం సాయంత్రం... సిక్ విలేజ్‌లో ఓ స్నేహి తుణ్ణి కల్సుకుని తిరుగు ప్రయాణమైనపుడు గుర్తొ చ్చింది. చాయమ్మ ఉండేది కూడా ఈ ప్రాంతానికి దగ్గరే నని. పనిలోపనిగా ఫరూక్‌ని పట్టుకుని కడిగెయ్యాలను కున్నా. చాయమ్మ చెప్పిన గుర్తుల ఆధారంగా యిల్లు వెతుక్కుంటూ మెల్లగా నడుస్తున్నా. గుడిసెలు... రేకులు కప్పిన యిల్లు... కొన్నిచోట్ల ఆరు బయటే మంచాలు వేసి ఉన్నాయి. ఎండాకాలం సాయంత్రం... సమయం ఏడు గంటలు... చల్లటి గాలి వీస్తోంది.



లైటు స్తంభానికి ఎదురెదురుగా ఉంది. చాయమ్మ చెప్పిన గుర్తుల ప్రకారం బహుశా యిదే ఆమె యిల్లయి ఉంటుంది. పిలుద్దామనుకునే లోపల...

"బస్ బేటా బస్... యింక చాలు" అని వినిపించింది. అది చాయమ్మ గొంతే. నేను ఆగిపోయాను.

"కొద్దిగా తినమ్మా. మా అమ్మవుగా... నా తల్లివిగా... నాకోసం తినమ్మా"

"కడుపు నిండింది బేటా. యిక నావల్ల కాదు"

"నీకు చేపల కూర యిష్టమని దగ్గరుండి మరీ వండించానమ్మా. యింకో ముక్క... అంతే. మళ్ళా అడ గను."

"నీ పిల్లలకు పెట్టు."

"వాళ్ళకోసం వాళ్ళమ్మ వేరే ఎత్తిపెట్టిందిలే. మా అమ్మ కోసం యిదంతా నేను ఎత్తి పెట్టాను. తినమ్మా. నీ చుట్టూ ఈ థాలీ పట్టుకుని తిరగలేను."

"మరి నీ చిన్నప్పుడు అన్నం తినకుండా మంచం చుట్టు నన్ను తిప్పి సతాయించలేదా? అందుకు ప్రతీ కారం" చాయమ్మ నవ్వు వినిపించింది.

"నీ అంత ఓపిక నాకు లేదమ్మా. ఓడిపోయాను. ఈ ఒక్క ముద్ద తినమ్మా... యిది నా ముద్ద... ఈ పక్కదేమో నాన్న ముద్ద."

"మరి కంచంలోని మిగతా అన్నం?"

"అవి నీ మనవళ్ళ ముద్దలు... సరేనా."

"ఒరేయ్... నేను మనవళ్ళని ఎత్తుకుని తిన్పించాల్సిన వయసులో నువ్వు నాకు గోరుముద్దలు తిన్పిస్తుంటే చూసి నీ పెళ్ళాం బిడ్డలు నవ్వుతున్నార్రా."

"మా... నీకు వాళ్ళు మనవళ్ళయితే నువ్వు నాకు అంతకన్నా పసి దానివి. నువ్వు నా చిన్నప్పుడు తిన్పిం చినట్లు నిన్ను ఎత్తుకొని చాంద్‌ని చూపిస్తూ తిన్పించ మంటావా... అలానే తిన్పిస్తాను... రా ఎత్తుకుంటాను."

"ఒరే బేటా... వద్దురా... నా మాట వినరా... వద్దురా"

చాయమ్మ బైటికి వచ్చింది. ఆమె వెనకే కంచం పట్టు కుని అతనొచ్చాడు.

నన్ను చూసి చాయమ్మ సిగ్గుపడిపోయింది. "చాలాసే పైందా బేటా వచ్చి" అంది మంచం తెప్పించి కూర్చో వేస్తూ, ఫరూక్ చేయి కడుక్కుని వచ్చి వాళ్ళమ్మకు లోటాతో నీళ్ళిచ్చాడు. ఆమె గటగటా తాగి 'యా అల్లా... పర్వర్ దిగార్' అంది సంతృప్తిగా.

వాళ్ళిద్దరి మధ్యా యిందాక జరిగిన సంభాషణ వింటున్నప్పుడు రామాయణ భారతాలు విన్నంత కమ్మగా అన్పించింది. ఎంతటి అన్యోన్యత...

"మీరైనా చెప్పండి సార్... పనికెళ్ళొద్దంటే వినదు. నాకు ముందు ఆరుగురు ఆడ పిల్లలు. అందర్నీ పెంచి పోషించి పెళ్ళిళ్ళు చేసింది. నాకు వూహ తెలిసినప్పటి నుంచీ వొళ్ళొంచి కష్టపడటం తప్ప విశ్రాంతి ఎలా ఉంటుందో ఎరగదు. యిప్పుడు నేను పెద్దవాణ్ణి అయ్యా కదా. మొదట్లో కిరాయికి ఆటో తోలే వాణ్ణి. యిపుడు స్వంతంగానే ఆటో కొనుక్కుని నడుపుతు న్నాను. నాకిద్దరు పిల్లలు. చీకూ చింతా లేకుండా హాయిగా ఉండొచ్చు కదా. నా మాట వినదు. పనికెళ్ళకపోతే తోచ దట. పది మందీ నేను కూడు పెట్టటం లేదనుకుంటారేమో నన్న దిగులు కాదు సార్. మా అమ్మను... మా అందరి కోసం తన రక్తమాంసాల్ని కరిగించిన అమ్మను సుఖపె ట్టలేక పోతున్నానే అని దిగులు"అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

చాయమ్మ నావైపు తిరిగి "బేటా... ఓసారి అడిగావు గుర్తుందా... యింత బలహీనంగా ఉండి కూడా యింతింత పని ఎలా చేయగలుగుతున్నావు... యిన్నిన్ని మెట్లు ఎలా ఎక్కగలుగుతున్నావు అని... నా బలం అంతా యిదుగో... నా కొడుకు నామీద చూపించే అనం తమైన ప్రేమ. వాడికి నేను తల్లినని మర్చిపోయి చాలా కాలమైంది బాబూ... వాడే నాకు తల్లి... వాడి ఒడిలో ఆడుకుని మారాంచేసే పసిపాపని నేను. అల్లా ఎంత దయామయుడు... ఎంత కృపాసముద్రుడు... నేను నమాజ్ చదివాక ప్రతిరోజూ అల్లాని ఏం కోరుతానో తెలుసా బేటా... నా కొడుకులాంటి కొడుకుల్నే ప్రతి తల్లికీ యివ్వమని" ఆమె కొంగుతో కన్నీళ్ళు తుడుచు కుంది.

"మరి యింతగా ప్రేమించే, ఆదరించే కొడుకు ఉన్న ప్పుడు ఎందుకు కష్టపడ్తావు చాయమ్మా"అని అడిగా.

ఆమె పసిపిల్లలా నవ్వింది.

"ఆ ప్రేమకోసం ఎంత కష్టమైనా పడాలనిపిస్తుంది కదూ. నాకిద్దరు మనవళ్ళు. వీడి చిన్నప్పుడు వీడికోసం కష్టపడితే యిప్పుడు మనవళ్ళకోసం కష్టపడ్తున్నా" అంది.

"దానికి ఫరూక్ ఉన్నాడుగా".

"వాణ్ణి ఒంటరిగా ఎలా వదిలేస్తాను చెప్పు బేటా... పిచ్చి తండ్రి... వాడికి తోడు నేను" అందామె ఫరూక్ వైపు వాత్సల్యంగా చూస్తూ.

సమాజం కీకారణ్యమనుకున్నా. పులులూ సింహా ల్లాంటి క్రూర జంతువులే ఉంటాయనుకున్నా. కాదు... యిక్కడ నెమళ్ళ నృత్యాలు, పక్షుల కిలకిలారావాలు, సీతాకోక చిలుకల సౌందర్యాభినయాలు కూడా ఉన్నాయి.

నాకు తెలీని నిజమేదో నా కళ్ళముందు ఆవిష్కృతమైం దన్న సంతృప్తితో వారి నుంచి వీడ్కోలు తీసుకున్నా. ★